సాక్షి కర్నూలు
సోమవారం : 18 : డిసెంబర్ : 2023




కేసీకి 159 క్యూసెక్కుల నీరు

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు ఆదివారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంలో 1.194 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



శ్రీమఠంలో భక్తుల రద్దీ

మంత్రాలయం : శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. క్యూలైన్లు కిక్కిరిసి ఉండటంతో స్వామి దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది.



అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులతో ఆలయ ప్రదక్షిణ చేశారు.

న్యూస్‌రీల్

జగనన్నది సంక్షేమ పాలన

- పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, ఎంపీ సంజీవ్ కుమార్



మాట్లాడుతున్న ఎంపీ సంజీవ్ కుమార్, వేదికపై రామసుబ్బారెడ్డి తదితరులు

కర్నూలు(రాజ్‌విహార్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిది సంక్షేమ పాలన అని కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, వైఎస్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం కర్నూలులో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్ర సందర్భంగా స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో న్యాయవాదుల, ఉద్యోగ, కార్మిక సంఘాల నేతలు, మేధావులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబం ఆర్థికంగా ఎదిగేందుకు ఎన్నో అవకాశాలు కల్పించిన నాయకుడు సీఎం జగన్ అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో అవకాశాలు కల్పించారన్నారు. అనంతరం పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య మాట్లాడుతూ.. చంద్రబాబు పదవీ దాహంలో ఆచరణకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక మోసం చేస్తారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను నా వాళ్ల అని సొంతం చేసుకున్న ఏకైక నాయకుడు సీఎం జగన్ అన్నారు. అనంతరం కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ పేదలంటే సీఎం జగన్‌కు ఎంతో అభిమానం అని, ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో పదవులు ఇచ్చారన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ సీఎం జగన్ వల్లే అణగారిన వర్గాలకు సమాజంలో గుర్తింపు ఉందన్నారు. సమావేశంలో పార్టీ మాజీ ఎంపీ బుట్టా రేణుక, లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్, పార్టీ నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, రాష్ట్ర నాయకులు సీహెచ్. మద్దయ్య, కర్నాటి పుల్లారెడ్డి పాల్గొన్నారు.

బడుగుల జీవితాల్లో వెలుగులు నింపిన జగన్

కర్నూలు(రాజ్‌విహార్): బడుగు, బలహీన వర్గాల బతుకుల్లో వెలుగు నింపిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ అన్నారు. ఆదివారం కర్నూలులోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అట్టడుగు వర్గాల ప్రజలు ఆర్థికంగా, సామాజికంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో అవకాశాలు కల్పిస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలు సమాజంలో తలెత్తుకుని జీవిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య మాట్లాడుతూ.. ఓటు బ్యాంక్ రాజకీయాలతో బలహీన వర్గాల వారిని టీడీపీ అధినేత చంద్రబాబు మోసం చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అట్టడుగు వర్గాల వారిని అక్కున చేర్చుకుని, పదవులు ఇచ్చి గౌరవించారన్నారు. కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. సామాజిక న్యాయం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సాధ్యమైందన్నారు. స్థానిక సంస్థలతో పాటు నామినేటెడ్ పదవుల్లో 50 శాతం అవకాశం కల్పించాలని చట్టం చేసిన ప్రభుత్వం తమదన్నారు. అనంతరం ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి బడుగు, బలహీన వర్గాలను పట్టించుకున్న నాయకులు ఒకరు మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి, రెండో వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అనంతరం కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ ఓసీ స్థానాల్లోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు పదవులు ఇచ్చిన నాయకుడు సీఎం జగన్ అన్నారు. సమావేశంలో కర్నూలు మాజీ ఎంపీ బుట్టా రేణుక, లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్, రాష్ట్ర నాయకులు సీహెచ్ మద్దయ్య పాల్గొన్నారు.



కర్నూలు పాతబస్తీలో సామాజిక సాధికార బస్సు యాత్రకు భారీగా తరలివచ్చిన ప్రజలు



బహిరంగ సభలో పార్టీ జెండాలతో యువకుల కోలాహలం

సామాజిక గర్జన

- జనంతో పోటెత్తిన కర్నూలు పాతబస్తీ
- అంబేడ్కర్ విగ్రహం నుంచి వన్‌టౌన్ వరకు భారీ ర్యాలీ
- పార్టీ జెండాలతో కదంతొక్కిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు
- సభలో ఆకట్టుకున్న ప్రజాప్రతినిధుల ప్రసంగాలు
- విజయవంతమైన సామాజిక సాధికార యాత్ర

భారీగా తరలి వచ్చిన జనంతో కర్నూలు పాతబస్తీ పోటెత్తింది. జై జగన్ నినాదాలతో హోరెత్తింది. ఆదివారం వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్ర విజయవంతమైంది. సమాజంలో తొలగుతున్న అసమానతలు.. ప్రభుత్వం చేసిన, చేస్తున్న మంచిని వివరిస్తూ మంత్రులు, ప్రజాప్రతినిధులు చేసిన ప్రసంగాలకు విశేష స్పందన వచ్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలను వరించిన పదవులు.. ఇంటింటికీ అందుతున్న సంక్షేమ పథకాలను గుర్తు చేస్తూ.. మళ్లీ ఇదే ప్రభుత్వానికి పట్టం కట్టాలని కోరిన సమయంలో కరతాళధ్వనులతో ప్రజల నుంచి మద్దతు లభించింది.

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ ముఖద్వారమైన కర్నూలులో 'సామాజిక' గర్జన ప్రతిధ్వనించింది. చారిత్రాత్మక కట్టడమైన కొండారెడ్డి బురుజు ప్రాంతం వైఎస్సార్‌సీపీ జెండాలతో కళకళలాడింది. ఆదివారం కర్నూలులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సామాజిక సాధికార బస్సుయాత్ర నిర్వహించారు. ఈ యాత్రకు భారీ ఎత్తున మైనార్టీలు, బీసీలు, ఎస్టీలు, ఎస్సీలు, మహిళలు తరలివచ్చారు. పార్టీ జెండాలతో యువకులు కదంతొక్కారు. యాత్రకు మంత్రులు ఆదిమూలపు సురేష్, గుమ్మనూరు జయరాం, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, ఎంపీ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, డాక్టర్ మధుసూదన్, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, మాజీ ఎంపీ బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ ఎస్వీ విజయ మనోహరి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్‌ఖాదర్, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ తదితరులు హాజరయ్యారు.

ర్యాలీకి సంపూర్ణ మద్దతు తెలిపిన ప్రజలు

సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా కొండారెడ్డి బురుజు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి వన్‌టౌన్ పోలీసు స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ వరకు వైఎస్ఆర్ సీపీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులు బస్సులో ర్యాలీగా వచ్చారు. సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమైన యాత్ర వేదికను చేరుకునే సమయానికి 6 గంటలైంది. దాదాపు గంటన్నర పాటు యాత్ర సాగింది. దారిలో అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం తెలిపారు. హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. తమకు ఎంతో మేలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు ఇవ్వనున్నట్లు చెప్పారు. అనంతరం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు బహిరంగ సభ జరిగింది.

విశేష స్పందన

ముందు నిర్ణయించిన ప్రకారం 4.30 గంటలకు బహిరంగ సభ ప్రారంభం కావాల్సి ఉంది. అయితే బస్సు యాత్ర ఆలస్యం కావడంతో ఆరు గంటలకు సభ ప్రారంభమైనా జనాలు కట్టు కదలలేదు. రాత్రి 8 గంటల వరకు మంత్రులు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు ప్రసంగాలను విన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయ్యాకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు న్యాయం జరిగిందని అన్నప్పుడు కరతాళధ్వనులతో సభాప్రాంగణాన్ని హోరెత్తించారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి తీసుకొద్దాం అన్నప్పుడు తప్పకుండా అంటూ చేతులెత్తి సంఘీభావం తెలిపారు.

అతిథులకు సన్మానం

బస్సుయాత్రకు వచ్చిన అతిథులకు కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ సన్మానం చేశారు. ప్రతి ఒక్కరికి శాలువ కప్పి బొకేపు అందజేసి సన్మానం చేశారు. ఇందులో మంత్రులతోపాటు కర్నూలు నియోజకవర్గానికి చెందిన ఎస్వీ మోహన్‌రెడ్డి దంపతులు, అహ్మద్ అలీఖాన్ కూడా సన్మానం పొందిన వారిలో ఉన్నారు. ఒకే వేదికపై కర్నూలు నియోజవకర్గ నాయకులందరూ కలసి తాము సమన్వయంతో ముందుకెళ్తున్నామని లేనిపోని ఆరోపణలు చేసే ప్రత్యర్థులు, ఎల్లో మీడియాకు చెప్పక చెప్పనే చెప్పారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సభ ప్రారంభానికి ముందు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూలుకు చెందిన విద్యార్థులు జగన్ మామయ్య అనే పాటకు నృత్యాలు చేశారు. అంతకముందు పలువురు కళాకారులు ఆటల, పాటలతో అలరించారు. రాయలసీమ ముద్దు బిడ్డ వైఎస్ జగన్ అంటూ పాడిన పాటకు పెద్ద ఎత్తున వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలు నృత్యాలు చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్‌చంద్రబోస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటోల ర్యాలీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ తండ్రి మొయిద్‌ఖాన్, నాయకులు తెర్నేకల్ సురేందర్‌రెడ్డి, సీహెచ్ మద్దయ్య, శిరోమణి, ఆదిమోహన్‌రెడ్డి, కర్నాటి పుల్లారెడ్డి, కరుణకార్‌రెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, డీకే రాజశేఖర్, రైల్వే ప్రసాదు, నవీన్, గద్దం రామకృష్ణ, కేదర్‌నాథ్, పర్వేజ్, మొయిన్‌ఖాన్, రాజేష్, కార్పొరేటర్లు సత్యనారాయణమ్మ,నీలోఫర్, రాజేశ్వరరెడ్డి, పర్వేజ్, డిప్యూటీ మేయర్ అరుణ, కృష్ణకాంత్, పుల్లమ్మ, అర్షియా పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.



బస్సుయాత్రలో ప్రజలకు అభివాదం చేస్తున్న కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మంత్రి గుమ్మనూరు జయరాం, చిత్రంలో మాజీ ఎంపీ బుట్టా రేణుక, ఎమ్మెల్సీ మధుసూదన్, కేడీసీసీబీ చైర్మన్ విజయ మనోహరి తదితరులు



చేతులెత్తి సంఘీభావం తెలుపుతున్న మంత్రులు సతీష్, గుమ్మనూరు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నేతలు

కరోనా సమయంలో టీజీ ఎక్కడున్నారు?

కర్నూలు నగర ప్రజల కోసం అమెరికాలో మంచి ఉద్యోగం వదులుకొని వచ్చా. కరోనా సమయంలో మానవత్వంతో పేదలకు మందులు, కాన్సన్‌ట్రేటర్లు అందించా. 2009లో వరదలు వచ్చిన సమయంలో మా ట్రస్టు ద్వారా పేదలను ఆదుకున్నా. ఎన్నికల సమయంలో ఓట్లు అడిగేందుకు వచ్చే టీజీ వెంకటేష్, టీజీభరత్ కరోనా సమయంలో ఎక్కడి వెళ్లారు? వరదలు వచ్చిన సమయంలోనూ ప్రాణాలను కాపాడుకోవడానికే ప్రాధాన్యత ఇచ్చారు. నేను మాత్రం కర్నూలు ప్రజల కోసం చావడానికైనా సిద్ధంగా ఉన్నా. నాలుగున్నరేళ్లలో రూ. వెయ్యి కోట్ల అభివృద్ధి పనులు, రూ. వెయ్యి కోట్ల సంక్షేమ పథకాలతో ప్రజలను ఆదుకున్నాం. 2024 ఎన్నికల్లో మళ్లీ వైఎస్ఆర్‌సీపీ గెలవకుంటే టీజీ వెంకటేష్ ఇంటి గేటు దగ్గర కాపు కాయాల్సి వస్తుంది. ఆ పరిస్థితి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు, మహిళలకు రాకూడదన్నదే నా తపన. కర్నూలు ప్రజల కోసం సుంకేసుల నుంచి ఎస్ఎస్ ట్యాంకు వరకు 90 కోట్ల రూపాయలతో చేపట్టిన పైపులైన్ పనులు రెండు నెలల్లో ప్రారంభిస్తాం. నీటి కొరత లేకుండా చేస్తాం. తుంగభద్ర పుష్కరాల సమయంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కర్నూలుకు రూ.100 కోట్లు ఇచ్చారు. రోడ్లు, శాశ్వతంగా పుష్కరఘాట్లను నిర్మించాం. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. కర్నూలు మునిసిపాలిటీ ఆధ్వర్యంలో రూ. 250 కోట్లతో పార్కులు, రోడ్లు, డ్రైనేజీలు బాగు చేయించాం. త్వరలోనే కర్నూలులో లా యూనివర్సిటీ ఏర్పాటు కాబోతోంది. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌తో వేలాది ఉద్యోగాలు రానున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇమామ్‌లకు రూ.5 వేలు, మౌజన్‌లకు రూ.10 వేల గౌరవ వేతనం ఇచ్చి ఆదుకున్నారు. జగనన్న ఫొటోతోనే మళ్లీ ఎన్నికల బరిలో దిగుతాం. చంద్రబాబు, పవన్ కల్యాణ్.. ఎంతమంది కలసి వచ్చినా 2024 ఎన్నికల్లో విజయం సాధించి కొండారెడ్డి బురుజుపై వైఎస్ఆర్‌సీపీ జెండాను ఎగురవేస్తాం.

– హఫీజ్‌ఖాన్, కర్నూలు ఎమ్మెల్యే



వైఎస్సార్, సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీలను ప్రదర్శిస్తున్న అభిమానులు

- కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో మా తడాఖా ఏమిటో చూపిస్తామన్నారు. కర్నూలులో జరిగిన సామాజిక సాధికార యాత్రకు వెల్లువలా జనాలు వచ్చారని, అయితే జనాలు లేని ఫొటోలు, వీడియోలు తీసుకుని ఎల్లో మీడియా అసత్య ప్రచారం చేస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 సీట్లలో వైఎస్ఆర్‌సీపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.
- కర్నూలు ఎంపీ డాక్టర్ సింగరి సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నంత వరకూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను ఎవరూ ఏమి చేయలేరాన్నరు. బడుగులమైన తాము నీడనిచ్చే వైఎస్ఆర్‌సీపీని నరుక్కుంటే నష్టపోయేది తామేనన్న విషయాన్ని గమనించామన్నారు., మరోసారి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని సీఎం చేసుకోవడానికి శక్తివంచన మేరకు కృషి చేస్తామన్నారు.
- మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన మూడునెలల్లో ఏకంగా 1.35లక్షల ఉద్యోగాలు ఇచ్చారన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి గాని, ప్రధానమంత్రిగాని ఈ విధంగా యువతకు ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు.
- వైఎస్ఆర్‌సీపీ నాయకుడు అహ్మద్ అలీఖాన్ మాట్లాడుతూ..ఆనాడు వైఎస్ఆర్ ముస్లింలకు 4 శాతం విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లను కల్పించడంతో ఎంతోమంది మైనార్టీలు డాక్టర్లు, లాయర్లు, ఇంజినీర్లు అయ్యారన్నారు. ప్రస్తుతం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీలకోసం అనేక సంక్షమ పథకాలను ప్రవేశపెట్టి ఆదుకుంటున్నారని కొనియాడారు.
- మాజీ ఎంపీ బుట్టా రేణుక మాట్లాడుతూ..బడుగు, బలహీన వర్గాల ప్రజల పిల్లల కోసం నాడు-నేడు కింద సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి 63 వేల పాఠశాలలను బాగు చేయించారన్నారు.
- ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ.. డిజిటల్ తరగతుల ద్వారా ఇంగ్లిషు మీడియంలో పేద పిల్లలకు బోధన జరుగుతుందంటే అది సీఎం వైఎస్ జగన్ చలువేనన్నారు.



ఆరోగ్యశ్రీ కొత్త కార్డు

- వ్యయ పరిమితి రూ. 5లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పెంపు
- ఇకపై అందరికీ కొత్త కార్డులు
- నేటి నుంచి జారీ చేయనున్న ప్రభుత్వం
- జిల్లాలో 6,49,000 మంది లబ్ధిదారులు

పేదలకు మరింత ఆరోగ్య'సిరి'

కర్నూలు(హాస్పిటల్): పేదల పాలిట సంజీవనిగా నిలిచిన డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం మరింత బలోపేతం అయ్యింది. ఈ పథకం కింద వ్యయ పరిమితిని రూ. 5లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సోమవారం నుంచి లబ్ధిదారులందరికీ కొత్తకార్డులు జారీ చేయనున్నారు. జిల్లాలో 2008లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు లక్షలాది మంది పేద, మధ్యతరగతి వారు ఈ పథకం ద్వారా లబ్ధిపొందారు. ఈ పథకం రాష్ట్రంలోనే గాక ఇతర రాష్ట్రాలు సైతం ఆచరించే విధంగా ఆదరణ పొందింది. అయితే వైఎస్సార్ మరణించిన తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు పథకాన్ని నీరుగార్చే ప్రయత్నం చేశారు. ఒక దశలో పథకాన్ని పూర్తిగా తీసేసే సాహసం కూడా చేశారు. కానీ ఈ పథకంపై ప్రజలకు ఉన్న అభిమానం చూసి వెనక్కి తగ్గారు. పథకం అమలులో పలు రకాల అంక్షలు పెడుతూ పేదలకు క్రమంగా దూరం చేసే ప్రయత్నమూ చేశారు. వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక పథకాన్ని మరింత మెరుగ్గా రూపుదిద్దారు. ఐదేళ్ల క్రితం 1800లోపు ఉన్న చికిత్సలను ఇప్పుడు 3,257కు పెంచారు. ఇప్పటి వరకు రూ.5లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీ ఖర్చును రూ.25లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.

ఐదేళ్లలో రెండున్నర లక్షల మందికి చికిత్స

జిల్లాలో డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం కింద 58 నెట్‌వర్క్ ఆసుపత్రులు పనిచేస్తున్నాయి. వీటిలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, ఆదోని, ఎమ్మిగనూరు ఏరియా ఆసుపత్రులు, పత్తికొండ, కోడుమూరు, ఆలూరు, వెల్దుర్తి, ఓర్వకల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రితో పాటు 48 ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి. జిల్లాలో గత ఐదేళ్ల కాలంలో ఈ పథకం ద్వారా 2.50 లక్షల మందికి పైగా రోగులు వివిధ రకాల వ్యాధులకు చికిత్స తీసుకున్నారు. ఈ పథకం కింద రోగులకు ఉచితంగా చికిత్స అందించినందుకు గాను ఆయా నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ.520కోట్ల వరకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లింపులు చేసింది. ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకునే సమయంలో రోగులకు ఆసరాగా ఉంటుందని ఆసరా పథకం కింద ప్రభుత్వం రూ.85కోట్ల వరకు చెల్లించింది.

నేటి నుంచి కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు జారీ

వార్షికాదాయం రూ.5లక్షల కంటే తక్కువ ఉన్న వారికి, తెల్లరేషన్‌కార్డు దారులకు ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింపజేస్తోంది. జిల్లా వ్యాప్తంగా డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం కింద 6,49,000 కార్డులు ఉన్నాయి. ఆరోగ్యశ్రీ సేవలను ప్రజలు అత్యంత సులభంగా పొందేందుకు గాను కొత్తగా, అధునాతనంగా ఈ కార్డులు రూపొందించారు. వీటికి ఈ నెల 18వ తేదీన నూతన మార్గదర్శకాలు జారీ చేయనున్నారు. అదే రోజు గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైఎస్ఆర్ విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు, గృహ సారథులు, వలంటీర్లను ఉద్దేశించి ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడనున్నారు. ఆరోగ్యశ్రీ సేవలను మరింత విస్తృతం చేయాలని వారికి దిశా నిర్దేశం చేయనున్నారు. అనంతరం ఆయన కొత్తగా రూపొందించిన కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు.



ఆరోగ్యశ్రీ కియోస్క్(హెల్ప్‌డెస్క్)

కలెక్టరేట్‌లో కొత్తకార్డుల జారీ కార్యక్రమం



డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం కింద కొత్తగా రూపొందించిన కార్డులను లబ్ధిదారులకు అందించే కార్యక్రమం సోమవారం లాంఛనంగా ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల చేతుల మీదుగా జిల్లా కలెక్టరేట్‌లో ప్రారంభించనున్నాం. ఇప్పటి వరకు ఈ కార్డు దారులకు రూ.5లక్షల వరకు ఉచితంగా వైద్యం అందుకునే అవకాశం ఉండింది. ఇకపై కొత్తకార్డులపై రూ.25లక్షల వరకు వైద్యాన్ని ఉచితంగా అందుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. ఆరోగ్యశ్రీ నూతన కార్డులను ఆయా సచివాలయాలకు పంపిస్తాం. వారికి వచ్చిన మేరకు లబ్ధిదారులకు అందజేస్తారు.

– డాక్టర్ భాస్కరరెడ్డి, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్, కర్నూలు

క్లుప్తంగా

సీఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ వీర మరణం

- ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల కాల్పుల్లో మృతి


సుధాకర్‌రెడ్డి (ఫైల్)

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మండలం వెలగటూరు గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ గొంగటి సుధాకర్‌రెడ్డి (53) ఛత్తీస్‌గఢ్‌లో ఆదివారం ఉదయం మావోయిస్టు కాల్పుల్లో వీర మరణం పొందారు. గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన సుధాకర్ రెడ్డి 30 ఏళ్ల క్రితం సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఎంపికై విధుల్లో చేరారు. నాలుగు ఏళ్ల క్రితం ఏఎస్ఐగా పదోన్నతి పొంది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో పనిచేస్తున్నారు. ఇటీవలే ఆయనకు ఎస్ఐగా పదోన్నతి లభించింది. కాగా శిక్షణ పూర్తి చేసుకుని ఎస్ఐగా విధుల్లో చేరాల్సి ఉండగా ఇంతలోనే విషాదం చోటు చేసుకుంది. విధి నిర్వహణలో భాగంగా మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో మృతి చెందారు. మృతునికి భార్య నాగలక్ష్మి, కుమారులు సూర్యచైతన్య రెడ్డి, జయ గణేష్‌రెడ్డి ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, గ్రామ సర్పంచ్ ఎల్వీ సుధాకర్‌రెడ్డి ఏఎస్ఐ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సోమవారం స్వగ్రామమైన వెలగటూరులో పోలీసు అధికార లాంఛనాలతో అంత్యక్రియల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృత్యువాత

ప్యాపిలి: కర్నూలు – బెంగళూరు జాతీయ రహదారిపై పోతుదొడ్డి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ విశ్వనాథం (45) మృతి చెందాడు. హైదరాబాదు నుంచి బెంగళూరుకు వెళ్తున్న లారీ పోతుదొడ్డి వద్దకు రాగానే స్టీరింగ్ రాడ్ విరిగిపోయింది. దీంతో లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ విశ్వనాథం తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎమ్మిగనూరు హెడ్‌కానిస్టేబుల్‌కు అవార్డు



సుభాన్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఏసీ సుబాన్ శనివారం డీజీపీ డిస్క్ అవార్డును విజయవాడలో డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి చేతులమీదుగా అందుకున్నారు. శాంతిభద్రతల విషయంలో చక్కటి ప్రతిభను కనబరచినందుకు 2022 సంవత్సరానికి తనకు ఈ పురస్కారం వచ్చిందని ఆదివారం ఆయన విలేకరులకు తెలిపారు. బాధ్యత పెరిగిందని, విధులను ఇంకా సమర్థవంతంగా నిర్వహిస్తానని చెప్పారు. అవార్డు అందుకున్న హెచ్‌సీ సుబాన్‌కు ఎస్పీ కృష్ణకాంత్, ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య, టౌన్ సీఐ మదుసుధన్‌రావు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది అభినందించారు.

ప్రణాళికతో చదివితే కొలువు సులువు

- గ్రూప్స్ సన్నద్ధతలో ఆత్మస్థైర్యం చాలా ముఖ్యం
- పరీక్షల్లో రాణించాలంటే ప్రణాళిక అవసరం
- విశ్లేషణాత్మక అభ్యాసన కీలకం
- సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు
- సదస్సుకు హాజరైన సీఎస్‌బీ అకాడమీ డైరెక్టర్, సివిల్స్ ర్యాంకర్ బాలలత



మాట్లాడుతున్న సివిల్స్ ర్యాంకర్ బాలలత


సదస్సుకు హాజరైన గ్రూప్స్ పరీక్షకు సన్నద్ధమవుతున్న యువతీ, యువకులు

కర్నూలు సిటీ: సివిల్స్, గ్రూప్స్‌లో విజయం సాధించడానికి చక్కని ప్రణాళికతో చదివాలని సీఎస్‌బీ అకాడమీ డైరెక్టర్, సివిల్స్ ర్యాంకర్ బాలలత తెలిపారు. గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలపై సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలు టీజీవీ లలిత కళాక్షేత్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు భారీ సంఖ్యలో యువతీ, యువకులు హాజరయ్యారు. సదస్సులో ముఖ్యవక్తగా బాలలత మాట్లాడుతూ.. నేడు చిన్న చిన్న ఉద్యోగాలకు చాలా కష్టపడి చదువుతున్నారన్నారు. గ్రూప్స్, సివిల్స్ వంటి పోటీ పరీక్షలకు ఇంకా ఎంత కష్టం ఉంటుందోనని చాలా మందికి భయం ఉంటుందన్నారు. చక్కని ప్రణాళికతో ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే గ్రూప్స్, సివిల్స్‌లో విజయం సాధించవచ్చన్నారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియం అనేవి పోటీ పరీక్షల్లో సమస్యే కాదని, నిత్యం తెలుగు పేపర్లతో పాటు, ఇంగ్లిష్ న్యూస్ పేపర్లను చదవుతూ అందులోని ముఖ్యమైన అంశాలను నోట్ చేసుకోవాలన్నారు. అలాగే 6 నుంచి 12 తరగతుల వరకు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు, ఇవీ సాధ్యం కాకపోతే ప్రభుత్వం పంపిణీ చేసే పాఠ్య పుస్తకాలను చదవాలన్నారు.

సిలబస్‌పై అవగాహన ఉండాలి

ప్రతి వ్యక్తి జీవితంలో ఒడిదుడుకులు సహజమని, సమస్య వచ్చిందని, కష్టమని పోరాటం నిలిపేస్తే అక్కడికే జీవితం ముగుస్తుందని బాలలత అన్నారు. గ్రూప్స్ సన్నద్ధం అయ్యే వారు ముందుగా సిలబస్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. ఏ సబ్జెక్టుకు ఎంత ప్రాధాన్యత ఉంటుంది? ఏఏ అంశాలపై ఎక్కువగా ప్రశ్నలు వస్తున్నాయి? కఠినమైన సబ్జెక్టును ఏ సమయంలో చదవాలి? అనే అంశాలపై ఓ ప్రణాళిక వేసుకోవాలన్నారు. పోటీ పరీక్షల్లో ప్రశ్నల సరళి తెలుసుకునేందుకు పాత ప్రశ్న పేపర్లను ప్రాక్టీస్ చేస్తూ ఉండాలని సూచించారు. చాలా మంది పరీక్షలకు ప్రిపరేషన్ అయ్యాక ప్రాక్టీస్ మొదలు పెడతారని, అలా చేస్తే సక్సెస్ అనేది చాలా తక్కువగా ఉంటుందన్నారు. ప్రతి రోజు కనీసం 50 బిట్లు అయినా ప్రాక్టీస్ చేస్తూ ఉండాలన్నారు. తరుచుగా న్యూస్ పేపర్లు చదువుతూ కరెంట్ అఫైర్స్‌తో సబ్జెక్టును కలుపుకుని విశ్లేషణాత్మకంగా సన్నద్ధం కావాలన్నారు. పరీక్షల సమయంలో ఆత్మస్థైర్యం తగ్గకుండా స్ఫూర్తిదాయకమైన అంశాలను గుర్తుకు తెచ్చుకుంటూ చదవాలన్నారు. సదస్సులో సాక్షి బ్రాంచ్ మేనేజర్ సతీష్ రావు, బ్యూరో ఇన్‌చార్జ్ రవికుమార్, యాడ్స్ మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి నింపారు



ఐఏఎస్ కావాలనే లక్ష్యంతో సివిల్స్ సన్నద్ధం అవుతున్నా. డబ్బులు పెట్టే స్థోమత లేకపోవడంతో ఉచిత కోచింగ్ కోసం స్కాలర్‌షిప్ పరీక్ష రాస్తూ కోచింగ్ తీసుకుంటున్నా. ఢిల్లీలో కోచింగ్ తీసుకున్నా..ప్రస్తుతం హైదరాబాదులో కోచింగ్‌కు హాజరవుతున్నా. సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీకి చెందిన బాలలత మేడం మాటలు నాలో స్ఫూర్తిని నింపాయి. పోటీ పరీక్షల్లో రాణించాలంటే ముందుగా ఆత్మస్థైర్యం అనేది చాలా కీలకం. పరీక్షల సన్నద్ధత, సిలబస్ తదితర అంశాలపై బాలలత మేడం వివరించిన తీరు ఆకట్టుకుంది. గ్రూప్స్–1, గ్రూప్–2, సివిల్స్ పోటీ పరీక్షలపై అవగహన సదస్సు నిర్వహించిన సాక్షి మీడియా గ్రూప్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

– సరస్వతి, హొళగుంద

స్పష్టత వచ్చింది



ప్రస్తుతం సచివాలయం ఉద్యోగం చేస్తున్నాను. 2018 నుంచి గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నా. ఇటీవలే ఎస్ఐ పరీక్షలు రాశాను. స్వల్ప మార్కుల తేడాతో ఉద్యోగం రాలేదు. గ్రూప్స్ పరీక్షలు అంటేనే చాలా పోటీ ఉంటుంది. ఈ పోటీలో విజయం సాధించాలంటే అభ్యర్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బాల లత మేడం చెప్పే సలహాలను యూట్యూబ్‌లో చూసేవాళ్లం. ఈ రోజు నేరుగా ఆమె క్లాసు వినే అవకాశం కల్పించిన సాక్షి మీడియా గ్రూప్‌కు ధన్యవాదాలు. పోటీ పరీక్షలకు తొలిసారి సన్నద్ధం అయ్యేవారు సైతం తక్కువ సమయంలో ఎలా విజయం సాధించాలి, ప్రణాళిక ఏ విధంగా తయారు చేసుకోవాలి అనేదాని స్పష్టత వచ్చింది.

– భూపతి, సచివాలయం ఉద్యోగి

సాక్షి మీడియాకు ధన్యవాదాలు



గ్రూప్స్ పరీక్షల సిలబస్ గురించి బాలలత మేడం చాలా బాగా వివరించారు. పరీక్ష అంటే మొత్తం సిలబస్ చదవాలని కాకుండా ప్రాధాన్యత అంశాలు, కరెంట్ అంశాలకు జోడించి విశ్లేషణాత్మకంగా చదువుకోవాలని చెప్పారు. తక్కువ సమయంలో కూడా ఈ పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధం కావొచ్చునో చక్కగా వివరించారు. సాక్షి పత్రికలో గ్రూప్స్ పరీక్షల గురించి వచ్చే అంశాలను రెగ్యులర్‌గా ఫాలో అవుతుంటాం. సబ్జెక్టుల విశ్లేషణ బాగుంటుంది. కరెంట్ అఫైర్స్ యాప్స్ బాగా ఉపయోగపడుతుంది. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని నిర్వహించిన సాక్షి మీడియా గ్రూప్‌కు ధన్యవాదాలు.

– పావని, కర్నూలు

మంచి కార్యక్రమం



గ్రూప్స్ పరీక్షలు సమయం తక్కువగా ఉన్నా ఎలా ప్రిపేర్ కావాలి అనే అంశంపై మంచి కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ ఉద్యోగం చేస్తూనే ఈ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నాను. నిరుద్యోగ అభ్యర్థులకు సిలబస్, పరీక్షల సన్నద్ధతతపై అవగాహన కల్పించేందుకు సాక్షి మీడియా గ్రూప్ వారు నిర్వహించిన సదస్సు చాలా చక్కగా ఉంది.

– జి.వరలక్ష్మి, క్రిష్ణానగర్, సచివాలయ ఉద్యోగి

చాలా చక్కగా చెప్పారు



గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలపై అభ్యర్థులకు ఉచితంగా అవగాహన కల్పిస్తున్నారని పేపర్‌లో చూశాను. సదస్సులో పరీక్షకు ఎలా సన్నద్ధం కావాలో చక్కగా వివరించారు. ఎలాంటి అంశాలపై ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వాలో చెప్పారు. కరెంట్ అఫైర్స్ ప్రాముఖ్యత తెలియజేశారు. 9 నెలల నుంచి గ్రూప్స్‌కి ప్రిపేర్ అవుతున్నాను. ఈ సదస్సు తరువాత నేను గ్రూప్స్ సాధించగలననే నమ్మకం కలిగింది. పరీక్షల్లో వచ్చిన మార్పులు, ప్రశ్నల సరళి గురించి వివరించిన తీరు ఆకట్టుకుంది.

– మధుబాల, నిడ్జూరు గ్రామం, కర్నూలు మండలం

ఆధునిక వైద్య విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి


డాక్టర్ డబ్ల్యు. సీతారామ్‌కు జ్ఞాపిక అందిస్తున్న అధికారులు, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): వైద్యులు, వైద్య విద్యార్థులు ఆధునిక వైద్యవిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ డబ్ల్యు. సీతారామ్ చెప్పారు. డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆదేశాల మేరకు ఆదివారం కర్నూలు మెడికల్ కాలేజీలో జోనల్ స్థాయిలో రేడియాలజీ, ఆప్తల్మాలజీ విభాగాలు నిరంతర వైద్యవిజ్ఞాన సదస్సు(సీఎంఈ)లు నిర్వహించాయి. రేడియాలజీ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ డబ్ల్యు. సీతారామ్ మాట్లాడుతూ ఆధునిక యంత్రాలు అందుబాటులోకి రావడంతో సూక్ష్మలోపాలు సైతం గుర్తించి సరిచేసేందుకు వీలవుతోందన్నారు. ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రిలో జరిగిన ఆప్తల్మాలజీ జోనల్ సీఎంఈకి ముఖ్య అతిథిగా కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ పి. సుధాకర్ హాజరయ్యారు. డయాబెటీస్ రోగుల్లో వచ్చే పలు రకాల కంటి జబ్బుల గురించి పలువురు కంటి వైద్యులు వివరించారు. కార్యక్రమంలో ప్రాంతీయ ప్రభుత్వ కంటి వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నర్సమ్మ, డాక్టర్ సాయిసుధీర్, హెచ్‌వోడీలు డాక్టర్ రాధారాణి, డాక్టర్ రేవతి, రేడియాలజిస్టులు డాక్టర్ జోజిరెడ్డి, డాక్టర్ గఫూర్, డాక్టర్ సురేష్, కంటి వైద్యులు డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ భరణీకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం


మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

గోనెగండ్ల: హెచ్. కైరవాడి గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కల్లూరుకు చెందిన ఉప్పరి ఉరుకుంద అనే వ్యక్తి ఆదివారం బళ్లారిలో తమ సమీప బంధువు చనిపోవడంతో అంత్యక్రియలకు బైక్‌పై వెళ్లాడు. సాయంత్రం తిరిగి వస్తుండగా హెచ్. కైరవాడి గ్రామ సమీపంలో నడిచి వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఉరుకుందుకు తీవ్ర గాయాలు కావడంతో 108లో కోడుమూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతిచెందిన వ్యక్తి గురించి పోలీసులు విచారిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

శ్రీ చెన్నకేశవ ఆంజనేయస్వామి దేవాలయము
ఓర్వకల్లు (గ్రామం), కర్నూలు జిల్లా.
e-Procurement Tender
NIT NO.P/COE/1499/2023, Dt: 02-12-2023
3 అంతస్తుల రాజగోపుర నిర్మాణము కొరకు e-procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.
ఇట్లు కార్యనిర్వహణాధికారి

ఎఫ్ఆర్ఓ ఆఫీసర్స్ నూతన కమిటీ ఎన్నిక


మాట్లాడుతున్న దినేష్‌కుమార్‌రెడ్డి

నంద్యాల(సిటీ): ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ అసోసియేషన్ కర్నూలు సర్కిల్ పరిధిలోని నంద్యాల జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాయలసీమ ప్రాంతీయ కార్యదర్శిగా ఎస్‌సీ సుబ్బరాయుడు, జాయింట్ సెక్రటరీ సుదర్శన్ తెలిపారు. ఆదివారం శిరివెళ్ల మండలం పచ్చర్లలో జరిగిన ఎఫ్ఆర్ఓ అసోసియేషన్ ముఖ్య నాయకుల సమావేశంలో ఈ ఎన్నిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎఫ్ఆర్ఓ అసోసియేషన్ అభివృద్ధికి నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశామన్నారు. అడిషనల్ జాయింట్ సెక్రటరీగా సుదర్శన్‌ను ఎన్నుకున్నామన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు డివిజనల్ అధ్యక్షులు సుభాష్, ఉపాధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ అలీ, కోశాధికారిగా జెడ్ఎస్ ఝా తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు కర్నూలు స్విమ్మర్లు


జాతీయ పోటీలకు ఎంపికైన కర్నూలు స్విమ్మర్లు

కర్నూలు (టౌన్): పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఈనెల 16, 17 తేదీల్లో నిర్వహించిన 9వ సబ్ జూనియర్ జూనియర్ వింటర్, అక్వాటిక్ అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలు స్విమ్మర్లు ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో 7 బంగారు, 6 వెండి, 7 కాంస్య పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. భువనాదిత్య (1500 మీటర్లు, బంగారు), వై. దేవశ్రుత్ సాయి (200, 400, 800 మీటర్లు బ్రెస్ట్‌స్ట్రోక్, ఫ్రీస్టైల్, 100 మీటర్లలో కాంస్యం), సామియా తస్లీం (200 మీటర్ల బటర్ ఫ్లై 400 మీటర్ల ఐఎంలో బంగారు), కే. కృతి 400, 200 మీటర్లు ఫ్రీస్టైల్‌లో (వెండి), మానిక (50 మీటర్లు బ్యాక్‌స్ట్రోక్‌లో వెండి), అనిల్ (200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో కాంస్య), కే. మనీష్ అశ్విన్ (200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో కాంస్య), టి. వెర్షిక (50 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్‌లో కాంస్య) పతకాలు సాధించారు. పతకాలు సాధించిన స్విమ్మర్లను నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అభినందించారు. విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ సురేష్, స్విమ్మింగ్ కోచ్ నటరాజరావు పాల్గొన్నారు.

పెన్షనర్ల సంక్షేమానికి చర్యలు

- జిల్లా ట్రెజరీ డీడీ రామచంద్రరావు


జిల్లా ట్రెజరీ డీడీ రామచంద్రరావు, ఏటీవో రఘువీర్‌లను సత్కరిస్తున్న పెన్షనర్లు

కర్నూలు (అగ్రికల్చర్): పెన్షనర్ల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్రరావు తెలిపారు. పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు ప్రత్యేక గ్రీవెన్స్ కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ఆదివారం అబ్బాస్‌నగర్‌లోని కర్నూలు పెన్షనర్ల సంక్షేమ సంఘం కార్యాలయం ప్రాంగణంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ట్రెజరీ డీడీ మాట్లాడుతూ... పెన్షనర్లు సకాలంలో లైఫ్ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలన్నారు. రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి మాట్లాడుతూ... పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ఈ రోజు ప్రశాంతంగా జీవనం సాగిస్తున్నారంటే ధరమ్ స్వరూప్ నకారా చేసిన పోరాట ఫలితమేనన్నారు. 1983 నుంచి ప్రతి ఏటా... డిసెంబర్ 17న పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం 75 ఏళ్ల పైబడిన పెన్షనర్లు 30 మందిని సత్కరించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం సెక్రటరీ బి.జయచంద్రారెడ్డి, ఇతర నాయకులు గోవిందరాజులు, శేషయ్య, విజయకుమార్‌రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

సత్ఫలితాలిస్తున్న 'గ్యాప్'

- కెమికల్స్ లేని పంటల ఉత్పత్తి దిశగా ప్రభుత్వం చర్యలు
- గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్‌తో జిల్లాలో వరిసాగు
- పైలెట్ ప్రాజెక్టు కింద సి.బెళగల్ మండలం కొండాపురంలో సాగు
- తగ్గిన పెట్టుబడి వ్యయం
- ఆర్గానిక్ సర్టిఫికెట్ జారీ కోసం శాంపిల్స్ పంపిన అధికారులు
- నేడు గ్యాప్ సర్టిఫికేషన్ జారీ చేయనున్న సీఎం వైఎస్ జగన్


కొండాపురం గ్రామంలో గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ పద్ధతులతో సాగు చేసిన వరి పంట

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయంలో అధిగ దిగుబడులు సాధించడమే లక్ష్యంగా రైతులు అడ్డూఅదుపులేకుండా పురుగుమందులు వాడుతున్నారు. దీని వల్ల పెట్టుబడి వ్యయం పెరగడంతో పాటు ఆశించిన మేర లాభం ఉండదు. ఈ నేపథ్యంలో రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి నాణ్యమైన పంటల ఉత్పత్తి దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏఓ)తో కలిసి గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్(గ్యాప్) పనిచేస్తోంది. ఒకేసారి రసాయన ఎరువులు, పురుగుమందులు వాడటం బంద్ చేయిస్తే దిగుబడులపై ప్రభావం పడుతుంది కనుక క్రమంగా వాటి వాడకాన్ని తగ్గించేలా రైతులను చైతన్యం చేస్తోంది. ఇదే సమయంలో ఆర్గానిక్ పంటల సాగు వైపు వెళ్లేలా రైతులకు అవగాహన కల్పించడంతో పాటు ప్రతి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఒక పంటను గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ విధానాలతో సాగు చేయిస్తోంది.

నేడు ఆర్గానిక్ సర్టిఫికెట్స్ జారీ చేయనున్న సీఎం

వరిసాగులో కెమికల్స్ వినియోగం ఎక్కువగా ఉండటం వల్ల ప్రస్తుతం వేలాది మంది రైతులు ఆర్గానిక్ ఉత్పత్తులపై దృష్టిసారిస్తున్నారు. 2023–24లో సి.బెళగల్ మండలం కొండాపురం(రంగాపురం) గ్రామంలో మోడల్‌గా గుడ్అగ్రికల్చర్ ప్రాక్టీస్ విధానాలతో వరి సాగు చేశారు. 50 మంది రైతులతో 25 హెక్టార్లలో గ్యాప్ పద్ధతులకు అనుగుణంగా వరి పండించడం విశేషం. పండించిన పంటలను ఆర్గానిక్ ఉత్పత్తులుగా గుర్తిస్తూ సర్టిఫికెట్ జారీ చేయడానికి రంగం సిద్ధమైంది. ఈ ధ్రువీకరణపత్రం ఉండటం వల్ల పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో రెట్టింపు ధర లభించే అవకాశం ఏర్పడింది. ఇప్పటికే అధికారులు ఆర్గానిక్ సర్టిఫికెట్ కోసం శాంపిల్స్ పంపడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో నేడు వాటిని జారీ చేయనున్నారు.

అధికారుల పర్యవేక్షణలో వరి సాగు

గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ కింద వరి సాగు పూర్తిగా వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో జరుగుతుంది. వారం వారం డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమాన్ని గ్రామంలో నిర్వహించి రైతులకు గ్యాప్ పద్ధతులపై అవగాహన పెంచుతున్నారు. కొండాపురం గ్రామంలో ఈ పద్ధతిలో సాగు చేసిన వరి పంటల్లో వేపచెక్కను ఎక్కువగా వినియోగించడం, గో ఆధారిత పద్ధతులు పాటించడం వల్ల సూక్ష్మ జీవులు విశేషంగా అభివృద్ధి చెంది పైరు ఎదుగుదలకు తోడ్పడుతున్నాయి. వర్షాభావం ప్రభావం ఈ రైతులపై కూడా పడింది. మామూలుగా అయితే ఎకరాకు 40 బస్తాల వరకు దిగుబడి వస్తుంది. ఈ సారి 30 బస్తాల వరకు దిగుబడులు వచ్చాయి. అయితే, కెమికల్స్ లేకుండా పండించడం వల్ల గిట్టుబాటు ధరలు లభించే అవకాశం ఏర్పడింది.

భారీగా తగ్గిన పెట్టుబడులు

గ్యాప్ విధానాలకు అనుగుణంగా పంటలు సాగు చేయడం ద్వారా పెట్టుబడి వ్యయం గణనీయంగా తగ్గిపోయింది. వ్యవసాయంలో అత్యధికంగా ఎరువులు, పురుగుమందులపైనే రైతులు పెట్టుబడి పెడుతున్నారు. వీటి ద్వారానే పెట్టుబడి వ్యయం తడిసిమోపెడవుతోంది. చివరకు పండించిన పంటల్లో కెమికల్స్ అవశేషాలు ఉన్నాయని మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లభించని పరిస్థితి ఏర్పడింది. వరి సాగులో ఎకరాకు రూ.45 వేల వరకు పెట్టుబడులు పెడుతున్నారు. గ్యాప్ పద్ధతులు తూచా పాటించడం వల్ల ఎకరాకు పెట్టుబడి వ్యయం రూ.15వేల నుంచి రూ.20 వేల వరకు తగ్గుతుంది.

సర్టిఫికెట్ జారీకి ప్రత్యేక వ్యవస్థ

ఇప్పటి వరకు ఆర్గానిక్ సర్టిఫికెట్ జారీ చేసేందుకు ప్రత్యేక వ్యవస్థ అంటూ ప్రత్యేకంగా లేదు. మొదటి సారిగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థకు అనుబంధంగా ఏపీ స్టేట్ సేంద్రియ సర్టిఫికేషన్ అథారిటీ ఏర్పాటు చేసింది. వ్యవసాయ, ఉద్యాన పంటలకు సర్టిఫికేషన్ పొందే అవకాశం ఉంది. రైతులు మంచి వ్యవసాయ పద్ధతులు పాటించే విధంగా ప్రభుత్వం ప్రత్యేకంగా వైఎస్ఆర్ పొలంబడి, తోటబడి కూడా నిర్వహిస్తోంది. వీటి ద్వారా కెమికల్స్ తగ్గించడం.. రైతులు సేంద్రియం వైపు వెళ్లే విధంగా అవగాహన కల్పించడం జరుగుతోంది. 2022లో గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ విధానాలపై కర్నూలులో రాష్ట్రంలోని వివిధ జిల్లాల వ్యవసాయ, ఉద్యాన అధికారులకు శిక్షణ కూడా ఇచ్చారు. శిక్షణ పొందిన అధికారులు గ్యాప్ పద్ధతులతో రైతులతో వ్యవసాయం చేయించడంపై దృష్టి సారించారు.

కెమికల్స్ అవశేషాలు లేకుండా వరి పండించాం



గ్యాప్‌కు అనుగుణంగా వరి సాగు చేశాము. మేము కొన్నేళ్లుగా సీఎస్ఏ సహకారంతో సేంద్రియ వ్యవసాయం చేస్తున్నాము. రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించడం లేదు. ఈ ఏడాది కొంతమేర దిగుబడులు తగ్గిపోయాయి. అందుకు బాధ లేదు. ఎందుకంటే కెమికల్స్ లేని బియ్యానికి మార్కెట్‌లో డిమాండ్ ఉంది. మేము పండించిన ధాన్యానికి ఆర్గానిక్ సర్టిఫికెట్ కూడా వస్తుంది. ఇప్పటికే వ్యవసాయ అధికారులు శాంపిల్స్ పంపారు.

– పి.మధుసూదన్‌రెడ్డి, రైతు, కొండాపురం, సి.బెళగల్ మండలం

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ నెరవాడ RGM కాలేజి వెనుక గల 3 సెంట్ల ఓపెన్ ప్లాటు అమ్మకమునకు కలదు. సెల్: 96180 87999 [L-1162739]

■ నంద్యాల To ఆళ్లగడ్డ, NH-40కి ఆనుకొని, ఆళ్లగడ్డకు సమీపంలో కమర్షియల్‌గా ఉపయోగపడే 25 సెంట్లు స్థలం కలిగిన 2 ప్లాట్లు అమ్మకానికి కలవు. సెంటు కేవలం 2.50 లక్షలు. సంప్ర: ఓనర్–9441071346. [L-822254]

HOUSE FOR SALE

■ బాలాజీ నగర్‌లో ఉత్తరం 7.5 సెంట్లలో 2 షాపులు 3 కార్లు పార్కింగ్‌లో హోమ్ థియేటర్ పెట్టుకోగల 25 అడుగుల హాలుతో 10 రూముల ఇల్లు అమ్మకానికి కలదు. నోబ్రోకర్స్–8919868887. [L-806255]

■ 3 BHK South Face LIC Office, వెనుకవైపు, విశ్వాసపురం నంద్యాల సెల్ నెం. 9704441253 అతి తక్కువ ధరలో 40 లక్షలు వె॥ 19xపొ॥ 60. [C-777276]

TO - LET

■ కర్నూలు–డోన్ రోడ్డు, వెంగన్న బావి దగ్గర బిల్డింగ్ అద్దెకు ఇవ్వబడును. మరిన్ని వివరాలకు సంప్రదించండి. సెల్: 8121650278. [L-822255]

SERVICES

■ వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్ అవసరం లేదు. NPA కూడా దరఖాస్తు. డాల్ఫిన్ ఫైనాన్స్, రాజన్, సెల్: 8437924006. [W-788967]

WANTED

■ కర్నూలు జిల్లా కాల్వబుగ్గ దగ్గరలో గల మత్స్యం ఫ్యాక్టరీ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. జీతం: 12000/– రూము+ భోజనం. Qly: 10-Degree. 95817 76921, 95817 76923 [L-1162738]

■ అర్జెంట్‌గా కావలెను: ప్రముఖ MNC కంపెనీలో పని చేయుటకు స్త్రీ/పురుషులు కావలయును. క్వాలిఫికేషన్: ఏని డిగ్రీ, జీతం: 15,000 నుండి 18,000, సెల్: 9063222981, 9063222986, 8500619888, 9063222980. [L-806280]

■ కర్నూలు జిల్లా, నంద్యాల, నందికోట్కూరు స్టోరేజి ప్రైవేట్ లిమిటెడ్ నందు పనిచేయుటకు 1) బిజినెస్ ఎగ్జిక్యూటివ్ మరియు 2) స్టోరేజ్ క్లర్క్ పై రెండు పోస్టులకు ఆసక్తిగల అభ్యర్థులు కావలెను. సంప్రదించండి. : 9394838383 [G-77]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 18k. ఫోన్: 9160900024 / 9640400073. [HA-953]

■ కన్సల్టెన్సీ కాదు.VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ : 15000 -40000, ఫ్రీ రూమ్+భోజనం. Hyd. 9014885406 [HA-993]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

